

20న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 20న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'శ్రీకాకుళం జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు ఈ సమావేశాలు ప్రారంభమవుతాయి. ముందుగా 6వస్థాయీ సంఘం, 11.30 గంటలకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12.30గంటలకు 5వస్థాయి సంఘం సమావేశాలు నిర్వహిస్తాం. 2.30గంటల నుంచి 1, 2, 4, 7 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయి' అని సీఈవో వెల్లడించారు.



కొండములగాం, రామతీర్థం మీదుగా లారీల్లో తరలిస్తున్న ఇసుక

రూటు మార్చేసి..

- అడ్డదారిలో ఇసుక అక్రమ రవాణా
- పైడిభీమవరం చెక్‌పోస్టును తప్పించుకుని..
- రణస్థలం మీదుగా నెల్లిమర్ల నుంచి విజయనగరం, విశాఖకు తరలింపు

రణస్థలం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాదారులు రూటు మార్చారు. జాతీయ రహదారిపై చెక్‌పోస్టులు, పోలీసులు, రెవెన్యూ అధికారుల తనిఖీల నేపథ్యంలో.. హైవేకు అనుబంధంగా ఉండే గ్రామీణ రహదారుల మీదుగా గమ్యస్థానాలకు ఇసుకను చేర్చుతున్నారు. ఈ నెల 14న రణస్థలం మండలం పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తనిఖీలు చేపట్టిన సంగతి తెలిసిందే. 28 లారీలను తనిఖీ చేయగా.. 12 లారీల్లో నకిలీ బిల్లులతో ఇసుక తరలిస్తున్నట్టు తేలింది. దీంతో చెక్‌పోస్టు వద్ద నిఘా కట్టుదిట్టం చేశారు. మళ్లీ మరుసటిరోజు మరో మూడు ఇసుక లారీలు నకిలీ బిల్లులతో పట్టుబడగా.. అధికారులు వాటిని సీజ్ చేశారు. దీంతో ప్రస్తుతం ఇసుక అక్రమార్కులు రూటుమార్చారు. అధికారులకు పట్టుబడకుండా ఉండేందుకు అడ్డదారిలో.. రణస్థలంలోని రామతీర్థాలు జంక్షన్‌వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. రాత్రివేళల్లో కమ్మసిగడాం, రామతీర్థాలు, నెల్లిమర్ల మీదుగా విజయనగరం, ఆపై విశాఖకు ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ రూట్‌లో రోజుకు సుమారు 50 ఇసుక లారీలు వెళ్తుంటాయి. కొండములగాం గ్రామం ఈ రోడ్డుకు ఆనుకుని ఉండడంతో లారీల శబ్దానికి రాత్రిపూట నిద్ర ఉండడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

సగం నకిలీ బిల్లులతోనే..

ప్రతిరోజూ జిల్లా నుంచి 150 లారీల ఇసుక విశాఖపట్నానికి రవాణా చేస్తున్నారు. ఇందులో సగానికి సగం నకిలీ బిల్లులతోనే తరలిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. దొరికితేనే దొంగ.. లేదంటే దర్జాగా తరలించుకుపోతున్నారు. ఇందులో అధికారుల హస్తం కూడా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు ఉన్నాయి. మరోవైపు జాతీయ రహదారిపై పోలీసుల నిఘా ఉంటుంది. ఇంకోవైపు టాస్క్‌ఫోర్స్ సైతం దృష్టి పెట్టింది. అయినా ఇసుక తరలించుకు పోతున్నా రంటే దీనివెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక రీచ్ నిర్వాహకులతోపాటు విశాఖకు ఇసుక తరలిస్తున్నవారితో సమన్వయం చేసుకున్న అధికారులు ఎవరు? అనే చర్చ సాగుతోంది. ఇందులో ప్రజాప్రతినిధుల ప్రమేయం కన్నా.. అధికారుల పాత్ర ఎక్కువగా ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జేసీ తనిఖీతో వెలుగులోకి..

పైడిభీమవరం వద్ద అంతర్‌జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కానీ జేసీ ఫర్మాన్ (మిగతా 6వ పేజీలో..)

సేవలు అందించేదెలా?

- అసంపూర్తిగా రైతు సేవా కేంద్రాలు
- కొన్నిచోట్ల నిర్మించినా ప్రారంభంకాని భవనాలు
- ఇరుకు గదుల్లో నిర్వహణ
- రైతులకు తప్పని ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపైన ఆశలు

మెళియాపుట్టి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాతలకు సక్రమంగా సేవలందడం లేదు. గత వైసీపీ సర్కారు రైతులకు సేవలను మరింత దగ్గర చేయాలనే ఉద్దేశంతో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి కోసం రూ. కోట్ల నిధులు కేటాయించింది. అయితే సకాలంలో నిధులు మంజూరు చేయక పోవడంతో చాలాచోట్ల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయినా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆ భవనాలు ఇంకా ప్రారంభించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. ఈ ప్రభుత్వంలోనైనా రైతు సేవా కేంద్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మించినా ప్రారంభానికి నోచుకోని ఇలాయిపురం రైతు సేవా కేంద్రం



ఇరుకు ఇంటిలో గొద్ద రైతు సేవా కేంద్రం

మెళియాపుట్టి మండలం గొద్ద రైతు సేవా కేంద్రం భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఈ కేంద్రం పరిధిలో 587 మంది రైతులు ఉన్నారు. ఇరుకైన ఇంటిని అద్దెకు తీసుకొని అందులో రైతులకు సేవలు అందిస్తున్నారు. కనీసం రైతులు కూర్చోవడానికి కూడా అక్కడ స్థలం లేదు. దీంతో ఎప్పుడైనా సమావేశాలు జరిగితే రైతులను ఆరుబయటే కూర్చోబెడుతుంటారు.

మెళియాపుట్టి మండలం ఇలాయిపురం సచివాలయం పరిధిలోని మూడు పంచాయతీ లకు సంబంధించి ఒక రైతు సేవా కేంద్రాన్ని నిర్మించారు. భవనం పనులు పూర్తయినా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో ఆ భవవాన్ని ఇంకా ప్రారంభించలేదు. దీంతో ఇరుకైన రేకు ఇంటిలో రైతు సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీనివల్ల ఈ కేంద్రం పరిధిలోని సుమారు 350 మంది గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



రేకు ఇంటిలో ఇలాయిపురం రైతు సేవా కేంద్రం నిర్వహణ

జిల్లాలో పరిస్థితి..

వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో 828 రైతుభరోసా కేంద్రాల నిర్మాణానికి సుమారు రూ.180.50కోట్లు మంజూరు చేశారు. జిల్లా పునర్విభజన తరువాత సిక్కోలులో 656 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 238 కేంద్రాలను పూర్తిచేసి అప్పగించారు. మరో 40 కేంద్రాల నిర్మాణం పూర్తయినా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో అవి ప్రారంభానికి నోచుకోలేదు. మిగిలిన 378 భవనాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇలాంటి చోట ఇరుకైన అద్దె భవనాల్లో ఆర్‌బీకేలను నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆర్‌బీకేలను రైతు సేవాకేంద్రాలుగా పేరు మార్చింది. ఆ కేంద్రాల పరిధిలోని ప్రతి రైతుకు యూనిక్ నెంబర్ కేటాయిస్తోంది. ఈ ప్రక్రియ జిల్లాలో చురుగ్గా (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గుజరాతీపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. ఎస్ఎస్‌సీ పరీక్షలకు 28,984 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జిల్లాలో 149 పరీక్షా కేంద్రాలకుగానూ 149మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఏడుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశాం. ఓపెన్‌స్కూల్ సొసైటీ పబ్లిక్ పరీక్షలకు 807 మంది హాజరు కానున్నారు. అందుకు జిల్లాలో 8 పరీక్షా కేంద్రాల్లో ఎనిమిది మంది చీఫ్ సూపరింటెండెంట్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. ఇంటర్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. ఈ పరీక్షలకు 1,553 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకుగాను 8 పరీక్షా కేంద్రాలకుగాను 8 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామ'ని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, పారామెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల నిర్వహణపై దృష్టి సారించాలని, పరీక్షలు విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. డీఈవో తిరుమలచైతన్య మాట్లాడుతూ పరీక్షలు విజయవంతానికి అధికారులంతా సమన్వయంతో సహకరించాలని కోరారు. సమావేశంలో డీఆర్వో వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, ఏసీఈ లియాఖత్ అలీ ఖాన్, జిల్లా ఒకేషనల్ అధికారి తవిటినాయుడు, డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, డీఆర్‌పీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా ఉద్యానవన అధికారి వరప్రసాద్, యూత్ కో ఆర్డినేటర్ ఉజ్వల్ పాల్గొన్నారు.

15 కేంద్రాల్లో గ్రూప్-2

- హాజరుకానున్న 5,535 మంది అభ్యర్థులు

6లో

వ్యసనాలకు బానిసై.. అప్పులు చేసి..

- దొంగగా మారిన వ్యక్తి అరెస్టు
- శాలిహుండం చోరీ కేసు ఛేదించిన పోలీసులు
- పదిహేడున్నర తులాల బంగారం స్వాధీనం



8లో

ఎక్కువ కేసులు రాజీ చేయండి

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

7లో

అంగన్‌వాడీల్లో అమ్మభాష

- నేటి నుంచి కార్యకర్తలకు శిక్షణ
- మాతృభాషపై పట్టు సాధించడమే లక్ష్యం



6లో

పాఠశాలల్లో భాషోత్సవాలు

- నాలుగు రోజుల పాటు నిర్వహణ



ఎంఎం వార్డులో కూలిన సీలింగ్

7లో

రిమ్స్‌లో కూలిన సీలింగ్

- ఎంఎం వార్డులో మహిళకు గాయాలు
- నిర్మాణంలో నాణ్యత లోపమే కారణమని విమర్శలు

కాంట్రాక్టర్లకు భరోసా

- పాత బకాయిలు చెల్లిస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో రూ.20 కోట్ల మేర జమ
- వైసీపీ తప్పిదాలపై దిద్దుబాటు చర్యలు



2021లో నిర్మించిన పలాస-పెదంచల రహదారి



- పలాసకు చెందిన **తలగాన వాసు** అనే కాంట్రాక్టర్.. 2021 నుంచి 2022 వరకూ పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.50లక్షల వరకూ పనులు చేయగా.. వైసీపీ ప్రభుత్వ కాలపరిమితి పూర్తయినా బిల్లులు చెల్లించలేదు. దీంతో ఆయన పనులు పూర్తిచేయడానికి ఆసక్తి చూపించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఉన్న బకాయిలను చెల్లించడంతో కాంట్రాక్టర్ వాసు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపడంతో ఆర్థికంగా నష్టపోయామని పేర్కొన్నారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి బిల్లుల బకాయిలు జమ చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పలాస, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను కూటమి ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నం చేస్తోంది. అభివృద్ధి పనులకు సంబంధించి రూ.10లక్షలలోపు ఉన్న కాంట్రాక్టర్ల బకాయిలను నేరుగా వారి ఖాతాల్లోకి జమచేస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లావ్యాప్తంగా రూ.20 కోట్ల బకాయిలు సంబంధిత కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి ఇప్పటి వరకూ జమయ్యాయి. రెండో విడత కూడా నిధులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తుండడంతో పాత, కొత్త కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు చేయడానికి సిద్ధమవుతున్నారు. వైసీపీ హయాంలో అప్పటి నాయకుల మాటలు నమ్మి అనేకమంది కాంట్రాక్టర్లు రూ.ఐదు లక్షల నుంచి రూ.3కోట్ల విలువైన రహదారులు, సచివాలయాల నిర్మాణాలు, కాలువలు, చెరువు పనులు చేపట్టారు. బిల్లుల విషయంలో వైసీపీ నేతలు కాలయాపన చేశారు. తరువాత వచ్చేది కూడా తమ ప్రభుత్వమేనని మీ డబ్బులకు ఢోకా లేదని భరోసా ఇవ్వడంతో రెట్టింపు ఉత్సాహంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేశారు. కానీ వారికి సకాలంలో బిల్లులు మంజూరు చేయలేదు. ఇలా గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు సుమారు రూ.500 కోట్లకుపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పరాజయం చెంది.. కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో అప్పట్లో పనులు చేసిన కాంట్రాక్టర్లు అంతా ఇక తమ బిల్లులు రావని ఆశలు వదులుకున్నారు. 2014-19 మధ్య కూడా టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది కాంట్రాక్టర్లకు బిల్లులు బకాయి ఉండిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉన్నా.. కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. అదే మాదిరి ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా వ్యవహరించి.. తమ బిల్లులు నిలిపేస్తుందని కాంట్రాక్టర్లు భావించారు. కానీ కాంట్రాక్టర్లకు భరోసా కల్పిస్తూ.. గత ప్రభుత్వ లోపాలపై దిద్దుబాటు చర్యలు తీసుకుంటోంది. ఇటీవల సంక్రాంతి కానుకగా పెండింగ్ బిల్లులు, బకాయిలు చెల్లించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలపడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. వివిధ పెండింగ్ బిల్లులతోపాటు కేవలం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు రూ.506 కోట్లు విడుదలకు (మిగతా 6వ పేజీలో..)

పాఠశాలల్లో.. భాషోత్సవాలు

- నేటి నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహణ
- భాషల ఔన్నత్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వ నిర్ణయం

హరిపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలు, కళాశాలల్లో భాషోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ నైపుణ్యాలతో భాష అభ్యాసనాన్ని విద్యార్థులకు అందించడం... అంతరించిపోతున్న భాషల గొప్పదనాన్ని చాటిచెప్పడమే ఈ కార్యక్రమం ఉద్దేశంగా పేర్కొంది. మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు భాషలకు సంబంధించి వివిధ పోటీలు నిర్వహించాలని సూచించింది.



ఈ అంశాల్లో పోటీలు..

ఎంపిక చేసిన భాషలకు సంబంధించి పఠనం, పొట్టి కథలు చెప్పడం, రాయడం, చర్చ, వక్తృత్వం, ఉపన్యాసం, స్వీయ తనిఖీ(సెల్ఫ్ చెక్), పాత్ర పోషణ(రోల్ ప్లే), బోధనోపకరణాల తయారీ తదితర అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. సంస్కృతంలో చిన్న కథలు రాయడం, శ్లోకాల పఠనం, టీఎల్ఎం తయారు చేయడం, ఒడియా, ఉర్దూలో మైనార్టీ విద్యార్థుల కోసం ప్రాసలు, గజళ్లు చెప్పడానికి అవకాశం ఉంది. ఈ నెల 18న ఆంగ్లం, 19న సంస్కృతం, హిందీ, ఉర్దూ, ఒడియా, 20న గిరిజన భాషలు, 21న తెలుగు భాషకు సంబంధించి పోటీలు నిర్వహించనున్నారు. గిరిజన భాషలు, సంస్కృతిని ప్రతిబింబించేలా సంప్రదాయ నృత్యాలు, పాటలు, ఆటలు ఉంటాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు ఒక్కో పాఠశాలకు రూ.500 చొప్పున మంజూరు చేశారు. విద్యార్థులకు భాషలపై ఇష్టాన్ని, గౌరవాన్ని పెంపొందించి.. పఠనాసక్తి కల్పించాలన్నదే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ఎస్ఎస్ఏ ఏపీసీ ఎస్.శశిభూషణ్ తెలిపారు.

జిల్లాలో ఇలా..

మొత్తం పాఠశాలలు	:	2,638
కళాశాలలు	:	93
నిధుల కేటాయింపు	:	రూ.13,65,500



అంగన్‌వాడీల్లో అమ్మ భాష

- నేటి నుంచి కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు
- మాతృభాషపై పట్టు సాధించడమే లక్ష్యం

మెళియాపుట్టి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఆంగ్ల విద్యపేరుతో పిల్లలకు మాతృభాషను దూరం చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కింది స్థాయి నుంచే పిల్లలు మాతృభాషపై పట్టుసాధించే విధంగా చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా ఇప్పటికే పూర్వ ప్రాథమిక విద్యలో ఆరేళ్ల లోపు చిన్నారులకు తెలుగు భాషను నేర్పించడానికి, వారిలో మానసిక వికాసం వృద్ధికి నూతన పాఠ్యపుస్తకాలను అందజేసింది. తాజాగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం నుంచి ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలను రెండు బ్యాచ్‌లుగా విభజించారు. మొదటి బ్యాచ్‌కు 18 నుంచి 20 వరకు, రెండో బ్యాచ్‌కు 22 నుంచి 24 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ బాధ్యతను విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వం అప్పగించింది.

పిల్లలకు ఆసక్తి కలిగే విధంగా..

జిల్లాలోని 16 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 3 నుంచి ఆరేళ్ల వయస్సు గల పిల్లలు 39,085 మంది ఉన్నారు. వీరికి పీపీ-1, పీపీ-2 పేరుతో పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు ఆకర్షణీయమైన బొమ్మలతో అక్షరమాలను తెలిపే పుస్తకాలను కేంద్రాలకు అందజేశారు. ఈ ఏడాది తెలుగుతో పాటు ఆంగ్లమాధ్యమం పుస్తకాలు అంగన్‌వాడీ కేంద్రాలకు చేరాయి. చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసి మ రింత ప్రోత్సహించనున్నారు. దీనికోసం ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆంగ్లం, సంస్కృతం, హిందీ, ఉర్దూ, గిరిజన భాష, సంస్కృతిని ప్రతిబింబించేలా నృత్యాలు, పాటలు, ఆటలపై అవగాహన కల్పించనున్నారు. సమగ్ర శిశు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 11 రకాల మందులను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేశారు. వీటి వినియోగంపై కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నారు. చిన్నారులకు జ్వరం, కళ్లు ఎర్రబడడం, విరేచనాలు, జలుబు, దగ్గు వంటివి ఉంటే వారికి ఏ మందులు ఇవ్వాలి అనే అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

శిక్షణ ఇస్తాం

పాతపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం. చిన్నారులు తెలుగుతో పాటు ఆంగ్లంపై పట్టుసాధించే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ అందిస్తాం. ఈ శిక్షణ బాధ్యతను విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వం అప్పగించింది.

\- విమలరాణి, ఐసీడీఎస్ సీడీపీవో, పాతపట్నం



ఈ-క్రాప్ నమోదుపై నిఘా



- క్షేత్ర స్థాయిలో అధికారుల పరిశీలన
- జిల్లాలో వేగవంతంగా ప్రక్రియ
- కౌలు రైతుల వివరాలూ నమోదు

నరసన్నపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు అందాల్సిన సేవలు, రాయితీల చెల్లింపుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఈ - క్రాప్ నమోదు, ఈ-కేవైసీ వంటివి పూర్తి స్థాయిలో చేయకపోవడంతో రైతులు నష్టపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం నుంచి అన్ని రకాల సేవలను అందించేందుకు ప్రణాళికతో ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగా రబీ పంటల వివరాలను నమోదు చేయిస్తోంది. గతంలో కొందరు అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లకుండా రైతు సేవా కేంద్రాల్లో ఉంటూ ..ఫొటోలను మార్చి మార్చి పెట్టేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు పండించే పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారో.. లేదో అనే విషయంపై నిఘా పెడుతోంది. ప్రత్యేకంగా ఒక యాప్ ద్వారా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. రబీలో ఈ -క్రాప్ నమోదు చురుకుగా సాగుతోంది. వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుల భూమి విస్తీర్ణం, ప్రస్తుతం సాగులోనున్న పంటల వివరాలను ఫొటోలతో సహా ఈ- క్రాప్ వైబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రైతులు తరువాత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ అథెంటికేషన్(ఈ-కేవైసీ) చేయించుకోవాల్సి ఉంటుంది. ఇదిలావుండగా... కౌలు రైతుల వివరాలను కూడా ఈ- క్రాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోయినా.. పొలంలో పంటలను సాగు చేస్తుంటే వారి పేరుతోనే వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ నెల 25వ తేదీ వరకు దీనికి గడువు ఉంది.

జిల్లాలో సాగు ఇలా..

జిల్లాలో రబీ సీజన్‌లో 1.28 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా మినప, పెసర, నువ్వు, మొక్కజొన్న, వేరుశెనగ, వరి, నువ్వులు, పొద్దు తిరుగుడు తదితర పంటలను సాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం జిల్లలో ఇప్పటి వరకు 1.10 లక్షల ఎకరాల్లో ఈ- క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయింది. మిగిలిన పొలాల్లో కూడా గడువులోగా ఈ- క్రాస్ నమోదు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జాబితాలను మార్చి ఒకటి నుంచి 5వ తేదీ వరకు రైతు సేవాకేంద్రాల్లో ప్రదర్శిస్తారు. 10వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి... 15న తుది జాబితాలను ప్రదర్శించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథ స్వామి తెలిపారు.



మడపాంలో ఈ - క్రాప్ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

సేవలు అందించేదెలా?

(ఐదో పేజీ తరువాయి)

సాగుతోంది. దీంతో రైతులు పెద్ద సంఖ్యలో రైతు సేవా కేంద్రాలకు వస్తున్నారు. అయితే, ఇరుకైన గదులు కావడంతో కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇరుకు గదుల్లోనే పశుసంవర్ధక శాఖకు సంబంధించిన మందులు, పరికరాలు ఉండడంతో రైతులు లోపలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఆరు బయటే ఉంటూ వారు పనులు చేయించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు సేవా కేంద్రాల నిర్వహణకు ఇటీవల నిధులు విడుదల చేసింది. కేంద్రంలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంతో పాటు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసి ఉంచేందుకు స్థలం లేక వాటిని అలాగే వదిలేస్తున్నారు. ఇప్పటికైనా రైతు సేవా కేంద్రాల నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లకు భరోసా

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. రూ.10 లక్షల లోపు పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించాలని ఆదేశాలు ఇవ్వడంతో ఆ మేరకు నిధులు విడుదలయ్యాయి. దీని ప్రకారం జిల్లాలో వందమందికి పైగా కాంట్రాక్టర్లు లబ్ధి పొందారు. టెక్కలి, పలాస సబ్‌డివిజన్‌ల్లో రూ.5 కోట్లు వరకూ కాంట్రాక్టర్లకు బకాయిలు సంబంధిత ఖాతాల్లో జమయ్యాయి. పార్టీలకు అతీతంగా పనులు చేసిన కాంట్రాక్టర్లు అందరికీ రూ.10లక్షల లోపు బకాయలు చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రూటు మార్చేసి..!

(ఐదో పేజీ తరువాయి)

అహ్మద్ ఖాన్ తనిఖీ చేసి నకిలీ బిల్లులతో ఇసుక తరలించుకుపోతున్నారన్న విషయాన్ని గుర్తించారు. అయితే అప్పటివరకూ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నట్టు? అన్న ప్రశ్న ఎదురవుతోంది. కొవిడ్ సమయంలో హైవే మీదుగా జిల్లాలోకి ఎవరినీ వదిలేవారు కాదు. కానీ ప్రస్తుతం కళ్లెదుటే భారీ వాహనాలతో సామర్థ్యానికి మించి ఇసుకను తరలిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఇసుక లారీలతోపాటు నిషేధిత వస్తువుల రవాణా జరగకుండా, వాటిని పసిగట్టేందుకు చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాల నిఘా పెట్టారు. అయితే అక్కడ అప్పుడప్పుడు సీసీ కెమెరాలు పనిచేయకపోవడం విశేషం. సీసీ కెమెరాల సంబంధించిన వైర్లు పలుమార్లు కత్తిరించినట్టు తెలుస్తోంది. అంటే అక్కడ ఇంటిదొంగ ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

పరిశ్రమల్లో భద్రతపై దృష్టి

- ప్రమాదాల నివారణకు తనిఖీలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు తీరును పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మోనియా, క్లోరిన్, ఎల్పీజీ, బ్యుటెన్ వంటి మండే స్వభావం గల వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు ఉండాలన్నారు. తరచూ మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. విష వాయువులు వెలువడే పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు భద్రతా ప్రమాణాలపై తనిఖీలు నిర్వహించాలని.. ఇప్పటికే పూర్తిచేసిన తనిఖీల నివేదిక ఆధారంగా అన్ని పరిశ్రమలు మార్గదర్శకాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా సంక్షోభ నివారణ కమిటీ విపత్తు నిర్వహణ, సంక్షోభాల నివారణకు పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. అత్యవసర సమయాల్లో వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రుల్లో మందులు, సిబ్బంది, అంబులెన్స్, అవసరమైన ఇతర సదుపాయాలు ఏమేరకు ఉండాలనే అంశాలపై సమీక్షించారు. భద్రతా ప్రమాణాలపై సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు, జె.శివశంకరరెడ్డి, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, సివిల్ డిఫెన్స్ అధికారి కె.పద్మలత, డిప్యూటీ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్స్ జె.సర్కార్, వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి, పొల్యూషన్ అధికారి కరుణశ్రీ, విపత్తుల నిర్వహణ డీపీఎం పి.రాము, పరిశ్రమల కేంద్రం మేనేజర్ ఉమామహేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ బాలమురళీకృష్ణ, వివిధ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శివరాత్రికి పటిష్ఠ ఏర్పాట్లు

- ఎస్పీ మహేశ్వరరెడ్డి
- శ్రీముఖలింగేశ్వరాలయం పరిశీలన

జలుమూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీముఖలింగంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈనెల 25 నుంచి జరుగనున్న శ్రీముఖలింగేశ్వర స్వామి శివరాత్రి మహోత్సవ ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆలయ సిబ్బందికి సూచించారు. బారికేడ్లు, టెంట్లు వేయాలని, దర్శనాలు వేగవంతంగా పూర్తయ్యేందుకు అవసరమైన సూచనలు ఇచ్చారు. 26న మహా శివరాత్రి రోజున ఆలయంలో జరిగే పూజలకు సంబంధించిన ఏర్పాట్లు, చక్రతీర్థ స్నానాలకు వెళ్లే మార్గాలను పరిశీలించారు. చక్రతీర్థ స్నానాలకు లక్షలాది మంది భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి వస్తారని, ఆమేరకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఎస్పీ మహేశ్వర రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ మూర్తి, సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ సిబ్బందికి ఆదేశించారు. సోమవారం రాత్రి రూరల్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా సందర్శించి.. రికార్డులు పరిశీలించారు. ఎఫ్ఐఆర్ నమోదు విధానం,సెంట్రీ రికార్డులు, విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అక్రమ రవాణాను అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా ముమ్మరంగా గస్తీ విధులు నిర్వహించాని సూచించారు. డ్రోన్‌లతో రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతాలను ఎస్పీ స్వయంగా పరిశీలించారు.



శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయ సిబ్బందితో చర్చిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ మూర్తి తదితరులు

15 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు

- హాజరు కానున్న 5,535 మంది అభ్యర్థులు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఫిబ్రవరి 17 ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 21న జరిగే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై కో-ఆర్డినేటింగ్, లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలకు అధికారులు అన్ని విధాలా సన్నద్ధం కావాలని ఆదేశించారు. 23వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. 'శ్రీకాకుళం, ఎచ్చెర్లలో మొత్తం 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. 5,535 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలి. పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. ప్రతి కేంద్రం వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్తు ఉండేలా చర్యలు తీసుకోవాలి. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాల'ని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాల మురళీకృష్ణ, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఉద్యానశాఖ అధికారి వరప్రసాద్, యూత్ కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, వివిధ కళాశాలల ప్రతినిధులు, సెక్షన్ ఇన్‌ఛార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసుదేవునికి అభిషేకం

- మందసలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హరిపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మందసలో వెలసిన అతి ప్రాచీనమైనది శ్రీవాసుదేవ పెరుమాళ్ దేవాలయం. ఈ ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 23 వరకు ఏడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రధాన అర్చకులు కూర్మాచార్యులు ఆధ్వర్యంలోవాసుదేవ పెరుమాళ్‌కు, ఆలయ ఆవరణలోని ఆంజనేయ స్వామికి అభిషేకం చేశారు. ఏడు రోజుల పాటు ఎటువంటి ఆటంకాలు కలగకుండా విజయవంతంగా పూర్తవ్వాలని ప్రార్థించారు. సోమవారం సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాల్లో నివేదన, గోష్ఠి, ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సత్యానంద పాడి, సంతోష్ పాండే, వివేక్ చతుర్వేది, అనిల్ పాండే, డోకి రామారావు దంపతులు, జీకే నాయుడు, వైఎస్ఎన్ మూర్తి, ఎస్.కిషోర్, కర్తలి తిరుపతి, మార్కండేయులు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా సీఐ తిరుపతి, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో 75 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



స్వామివారి పూజల్లో పాల్గొన్న భక్తులు



స్వామికి హారతి ఇస్తున్న ప్రధాన అర్చకులు కూర్మాచార్యులు

నేటి కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం ఉదయం శ్రీ వాసుదేవ పెరుమాళ్ అభిషేక మహోత్సవం, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, సేవాకాలం, విశ్వక్సేన ఆరాధన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లోహరిబంద శ్రీమన్నారాయణ భక్త బృందం, బి.గొనపపుట్టుగ, మందస మహేంద్ర కళామండలి కళాకారులతో సంగీత విభావరి ఏర్పాటు చేయనున్నారు.

కొక్కెర వ్యాధితో కోళ్లు మృతి: ఏడీ


రణస్థలంలో కోళ్ల రైతుతో మాట్లాడుతున్న పశువైద్యశాఖ సిబ్బంది

రణస్థలం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి):కొక్కెరవ్యాధి వల్ల నాటుకోళ్లు మృత్యువాతపడుతున్నాయని పశుసంవర్ధక శాఖ ఏడీ బి.దుర్గారావు తెలిపారు. ఆ కోళ్లకు ఏమైంది శీర్షికతో ఆంధ్రజ్యోతి కథనం సోమవారం ప్రచురితంకావడంతో పశు వైద్య సిబ్బంది స్పందించారు. ఈమేరకు లావేరు మండలంలోని అగ్రహారం, రణస్థలం మండలంలోని జేఆర్‌పురం, సీతమ్మవలసలో నాటు కోళ్లపెంచే రైతులను వైద్యులు రాంకుమార్, లవణ్య కలిశారు. రెండు నెలలుగా వింత వ్యాధితో నాటు కోళ్ళు మృతి చెందుతున్నాయని రణస్థలానికి చెందిన కోళ్ల రైతులు కోటేశ్వరరావు, రమణ పశువైద్య సిబ్బందికి వివరించారు. భవిష్యత్‌లో కోళ్లకు కొక్కెర వ్యాధి రాకుండా నివారించాలంటే నులిపురుగుల మందు, కొక్కెర తెగులు టీకాలు వేయించాలని సూచించారు. కోళ్ల రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రం నుంచి ఉచితంగా మందులు పొందాలని సూచించారు.

పనులు చేశారు.. బిల్లులు మరిచారు

● ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు ● ఇదీ టెక్కలి మండలంలో మినీ గోకులాల పరిస్థితి

టెక్కలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మినీ గోకులాల లబ్ధిదారులు బిల్లులు చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పనులు పూర్తయినా బిల్లులు కాకపోవడంతో లబోదిబోమంటున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పాడి రైతులకు మినీగోకులాల నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్, పశుసం వర్ధకశాఖలు హడావుడితో మండలంలో పంచాయతీకి ఒకటి చొప్పున్న పైలెట్ ప్రాజెక్ట్ కింద 39 మినీ గోకులాలు మంజూరుచేశాయి. అయితే ఇందులో 32 గోకులాలు యుద్ధప్రాతిపదికన లబ్దిదారులతో పనులు పూర్తిచేయించారు. రెండు ఆవుల మినీగోకులానికి రూ.లక్షా10వేలు, నాలుగు ఆవులు ఉన్న మినీ గోకులానికి రూ.లక్షా 85వేలు, ఆరు ఆవులు ఉన్న మినీగోకులానికి రూ.2లక్షల10వేలు నిధులు కేటాయించారు. అయితే పైలెట్ ప్రాజెక్ట్ కింద లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాడిరైతులు సైతం మినీ గోకులాలు నిర్మించారు. అయితే నిర్మించి నెలరోజులు దాటినా లబ్దిదారుల ఖాతాలో మాత్రం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి ఒక్కపైసా కూడా విడుదల కాకపోవడంతో వారంతా ఆందోళనకుచెందుతున్నారు. కాగా మండలంలో 32 మినీగోకులాల బిల్లులు జనరేట్ చేశామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో బగాది ప్రసాదరావు తెలిపారు. సుమారు ఎనిమిది వారాలుగా బిల్లులు చెల్లింపు నిలిచిపోయిందని, త్వరలో బిల్లులు చెల్లించనున్నట్లు చెప్పారు.


నర్సింగపల్లిలో నిర్మించిన మినీగోకులం


అరసవల్లి:శ్రీకాకుళంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు


ఇచ్ఛాపురం:సీడీపీవో నాగమణికి సమస్యలతో కూడిన పత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సమస్యలు పరిష్కరించాలి

● హామీలను అమలుచేయాలని అంగన్‌వాడీల డిమాండ్
● జిల్లాలోని ప్రాజెక్టు కార్యాలయాల వద్ద నిరసనలు

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గత ప్రభుత్వం హయాంలో 42 రోజుల పాటు సమ్మె చేసిన కాలంలో ప్రభుత్వం మినిట్స్ కాపీ ఆధారంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లాలోనిఐసీడీఎస్ కార్యాలయాల వద్ద సీఐటీయూ అనుబంధ సంస్థ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ప్రాజెక్టు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. -ఆంధ్రజ్యోతి బృందం

ఎక్కువ కేసులు రాజీ చేయండి

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా కోర్టు భవనంలో న్యాయాధికారులతో ఆన్‌లైన్‌లో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ మార్చి ఎనిమిదో తేదీన జరగనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేవిధంగా చూడాలని కోరారు. అలాగే జిల్లా కోర్టుఆవరణలోని బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు, న్యాయాధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మొదటి అదనపు న్యాయాధికారి పి.భాస్కరరావు మాట్లాడుతూ రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులు ముందుగా జాతీయ లోక్‌అదాలత్‌కు రిఫర్‌చేసి రాజీ అయ్యేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో 3, 4వ అదనపు జిల్లా న్యాయాధికారులు వివేక్ ఆనంద్ శ్రీనివాస్, ఎస్.ఎం.ఫణికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు జి.వాసుదేవ రావు, ఎం.అన్నంనాయుడు, వై.ప్రసన్నకుమార్, ఎన్ని సూర్యారావు, సీహెచ్.విజయ్‌కుమార్, శిష్టు రమేష్, టి.ఖగేంద్రనాధ్ పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన

శ్రీకాకుళంలోని బీసీ వసతి గృహాలను సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. వసతి గృహాల్లో మౌలికవసతులు, పారిశుధ్యం, పరిశుభ్రత, పరిసరాలను పరిశీలించారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి: వీసీ

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సిబ్బంది సమయపాలన పాటించాలని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని కోరారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్, సైన్స్, ఆర్ట్స్ కళాశాలలకు చెందిన విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, అధ్యాపకులు, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్లు, విద్యుత్ సరఫరాను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

డిగ్రీ కళాశాలకు ప్రహరీ నిర్మించాలి


రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

సోంపేట, ఫిబ్ర వరి 17(ఆంధ్ర జ్యోతి): బారువ డిగ్రీకళాశాలకు ప్రహరీ నిర్మించి ఆక్రమణలు అరికట్టాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఎ. యుగంధర్, ఎస్. జయరాం కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మంజూరుచేసిన రూ.79 లక్షలతో ప్రహరీ నిర్మించాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఐదుగురి ఎంపిక

బూర్జ, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓవీపేట ఆదర్శ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు తెలిపారు.ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, సిబ్బంది సంధ్యారాణి, శ్రీనివాసరావు, రాములు అభినందించారు.

న్యాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

కంచిలి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 17: ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కంచిలి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.ప్రసాద్,ఏపీవో ధనుంజయ, ఏపీ సీఎస్ఎఫ్ శివానందం,లలితమ్మ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

పొందూరు,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలు ఎంతో ఆరోగ్యకరమని ఎంపీడీవో మన్మథరావు, డీఎంఎంటీ భాస్కరరావు తెలిపారు.సోమవారం స్థానికమండలపరిషత్ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను, పలు రకాల కూరగాయలతో కూడిన స్టాల్‌ను ప్రారంభించారు.

ఆమదాలవలసలో దివ్యాంగుల నిర్ధారణ సర్వే


దివ్యాంగుల సర్వేచేస్తున్న సిబ్బంది

ఆమదాలవలస, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలోని పదో వార్డు పరిధిలో మెట్టక్కివలస ప్రాంతంలోగల కంద్రపేటలో దివ్యాంగుల నిర్ధారణ సర్వే సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్యానెల్ అడ్వకేట్ తమ్మినేని అన్నంనాయుడు, వైద్య సిబ్బంది భూలక్ష్మి, ఏఎన్ఎంలు డి.ధనలక్ష్మి, ఐ.అనుపమ పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 17 : యువత చెడువ్యసానాలకు దూరంగా ఉండాలని ఇచ్ఛాపురం టౌన్ ఎస్ఐ ఎం.ముకుందరావు కోరారు. సోమవారం ఇచ్ఛాపురంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో జయప్రకాష్, చాట్ల రాము పాల్గొన్నారు.

రణస్థలంలో చోరీ

రణస్థలం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రణస్థలంలోని మహాలక్ష్మీనగర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు జామి వెంకటేశ్వరి ఇంట్లో తులం బంగారం, 300 గ్రాముల వెండి ఆభరణాలు, కొంత నగదు చోరీ చేశారు. రెండు రోజులు క్యాంపు వెళ్లి తిరిగి సోమవారం రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపులు, బీరువా తెరిచి ఉన్నాయని బాధితురాలు తెలిపారు. ఈ మేరకు చోరీ జరిగిందని గుర్తించి జేఆర్‌పురం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది.

ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు

● పీయూసీ చైర్మన్ కూన రవికుమార్


మాట్లాడుతున్న రవికుమార్

పొందూరు,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రభుత్వం పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్యను పెంచుతోందని పీయూసీచైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ చెప్పారు. సోమవారం పొందూరులో ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన జరిగినమండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని పాఠశాలలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మారుస్తున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారన్నారు దీంతో మండలంలో 154 మంది ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య 250కి పైగా పెరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఎంపీటీసీలు కూన ప్రమీల, ఎ.కుమారి, ఎ.వాణి, ఎం.సీతారామరాజు, వి.పార్వతి, సర్పంచ్‌లు ఆర్.లక్ష్మి, పప్పలవేణు, బి. పోలినాయుడు ఎంపీడీవో మన్మథరావు పాల్గొన్నారు.

నిర్వాసితులకు వసతులు కల్పించాలి: కలమట


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కలమట వెంకటరమణ

అరసవల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌నిర్వాసితులకు మౌలిక వసతులు కల్పించాలని, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో విద్యుత్ దీపాలు, సిమెంట్ రోడ్లు మంజూరు చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మెళియాపుట్టి మండలంలోని మారేడుకోటలో కిడ్నీబాధితులు పెరుగుతుండడంతో ఆరోగ్యపరీక్షలునిర్వహించాలని, మంచి నీటి సదుపాయం కల్పించాలని కోరారు. వేసవి సమీపిస్తుండడంతో ప్రజలకు మంచినీటికి ఇబ్బందిలేకుండా చర్య తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

● మునిసిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తిరుపతిరావు

శ్రీకాకుళం అర్బన్,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని శ్రీకాకుళం జిల్లా సమితి మునిసిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు డిమాండ్‌చేశారు. సోమవారం శ్రీకాకుళంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ పి.ప్రసాద్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంమేరకుకార్మికులు నిరసనతెలిపారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్రరావు, గణేష్, మణి, రామచంద్ర, సరస్వతి, లక్ష్మి, కల్యాణి, తిరుమలరావు పాల్గొన్నారు.

కొళాయిలకు మోటార్లు బిగిస్తే చర్యలు: కమిషనర్

శ్రీకాకుళం అర్బన్,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా వినియోగదారులు వ్యక్తిగత మంచి నీటి కొళాయిలకు విద్యుత్ మోటార్లు బిగిస్తే చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ పీవీవీ ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వారం రోజుల తర్వాత ఇంటింటా కార్పొరేషన్ సిబ్బంది వచ్చి తనిఖీలు చేస్తారని, ఆ సమయంలో విద్యుత్ మోటార్లతో నీటి చౌర్యానికి పాల్పడినట్లు గుర్తిస్తే మొదటి సారి రూ.రెండు వేలు అపరాద రుసుము విధించనున్నట్లు పేర్కొన్నారు. రీకనక్షన్ నిమిత్తం రూ250లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. తర్వాత కూడా ఇటువంటి చర్యలకు పాల్పడితే శాశ్వతంగా కొళాయి తొలగిస్తామని కమిషనర్ హెచ్చరించారు.

ఏపీటీఎఫ్ నాయకుడి మృతికి సంతాపం

ఆమదాలవలస, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శి, విశ్రాంత స్కూల్ అసిస్టెంట్ తమ్మినేని రామానుజాచార్యులు మృతికి ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు భానుమూర్తి, ఉపాధ్యాయ సంఘ నాయకులు మోహన్‌రావు, జనార్దనరావు సంతాపం తెలిపారు. ప్రస్తుతం ఆయన విశ్వసాహితీ సేవా సంస్థ గౌరవాధ్యక్షులుగా ఉన్నారు.

20న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

రణస్థలం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రణస్థలం సబ్ స్టేషన్ ప్రాంగణంలో ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కార వేదిక జరగనుందని సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ బి.సత్యంనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులుఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహించే కార్యక్రమం జిసిగడాం,పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం, పైడిభీమవరం ఈపీడీసీఎల్ సెక్షన్‌పరిధిలో వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొట్టవలస జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. దూసి పీహెచ్‌సీ కంటి వైద్యాధికారి బీవీఎం ప్రసాదరావు నేతృత్వంలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. వారిలో నేత్ర చికిత్స అవసరాన్ని గుర్తించిన 20 మందికి హెచ్ఎం కె.రామకృష్ణారావు సారథ్యంలో కంటి అద్దాలు పంపిణీ చేశారు.

సచివాలయ ఉద్యోగుల కార్యవర్గం ఏర్పాటు

ఆమదాలవలస, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ ఎన్నిక సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా చింతాడ శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీలుగా సువ్వారి వెంకటలక్ష్మి, మానుకొండ కాళేశ్వరరావు, కోశాధికారిగా మండ మనోహర్, ఆర్గ నైజేషన్‌కార్యదర్శిగా శ్రీకాంత్, సభ్యులుగా సంతోష్‌కుమార్, వాసుదేవరావు, విజయకుమార్,శారద, ఎస్.రమ్య, శైలజ, టెక్నికల్ ఆర్గనైజర్లగా పభాకరరా వు, ఈశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం ఎంపీడీవో వెంకటరావును కలిశారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కొల్లివలసలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరంలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు పేర్కొన్నారు. ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో 80 సీట్లలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో మార్చి ఆరో తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ ఆరో తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రిమ్స్‌లో కూలిన సీలింగ్

● మహిళకు గాయాలు ● ఎంఎం వార్డులో రోగులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)లో సోమవారం రాత్రి సీలింగ్ కూలడంతో ఓ మహిళ గాయపడింది. దీంతో ఎంఎం వార్డులో రోగులకు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. రిమ్స్‌లోని రెండోఫ్లోర్‌లో ఉన్న మేల్ మెడిసిన్ (ఎంఎం)వార్డులో చికిత్స పొందేందుకు ఇటీవల పుడియా బలరాంచేరాడు. భర్త బాగోగులు చూసుకునేందుకు పేషెంట్ అటెండర్‌గా ఆయన భార్య పుడియా పుణ్యవతి కూడా అక్కడే ఉంటోంది. సోమవారం రాత్రి బలరాంను బాత్‌రూముకు తీసుకెళ్లేందుకు వెళ్తుండగా ఒక్కసారిగా పెద్దశబ్దం వచ్చింది. దీంతో ఆ వార్డులో ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపటి ఆస్పత్రి సిబ్బందితోపాటు అక్కడ ఉన్న రోగులు వెళ్లి పరిశీలించారు.బలరాం ఓ వైపు పడి ఉండగా ఆయన తీసుకెళ్లిన భార్య పుణ్యవతిపై ఆస్పత్రి గోడకువేసిన సీలింగ్ పడిపోయింది. అక్కడి చేరిన కొందరు సీలింగ్ కింద ఉన్న ఆమె బయటకుతీశారు. సీలింగ్ కాలి మీద పడిపోవడంతో పుణ్యవతి గాయాలయ్యాయి. దీంతో ఆమెను ఆదే ఆస్పత్రిలో చేర్పించి వైద్య సిబ్బంది చికిత్సచేశారు.

నాణ్యత లేని నిర్మాణాలు

రిమ్స్ఎంఎం వార్డులోని రోగి బంధువుపై సీలింగ్ కూలిపడిపోవడంతో అక్కడి నిర్మాణాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రిలో నిర్మాణాల బాధ్యత వహిస్తున్న ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు రోగులు వాపోతున్నారు. రెండేళ్ల పూర్తి కాగానే సీలింగ్ కూలిపోవడం నిర్మాణాల లోపాలకు అద్దంపడుతోందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికే మంత్రి అచ్చెన్నాయుడు రిమ్స్‌లో సమీక్షించి రోగులకు ఎటువంటి అసౌకర్యం కలిగించిన ఉపేక్షించేది లేదని హెచ్చరించిన విషయం విదితమే.ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంతో మంత్రి ఆదేశాలు బేఖాతర్ చేశారని ఆస్పత్రి సిబ్బంది బాహాటంగా చెబుతున్నారు. ఈఘటనతో ప్రస్తుతం రిమ్స్‌లో జరుగుతున్న పనులపై సైతం అనుమానాలు కలుగుతున్నాయి. కాగా హుటాహుటిన అసిస్టెంట్ ఆర్ఎంవో సుభాషిని అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆమదాలవలస, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని శ్రీహరిపురానికి చెందిన యువకుడు పొన్నాడ సురేష్ అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... ఆమదాలవలస పట్టణానికి చెందిన ఓ ప్రైవేటు వడ్డీ వ్యాపారి నుంచి సురేష్ నిరంతరం ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. ఇటీవల ఆ వడ్డీ వ్యాపారి ఇంటి వద్దకు వెళ్లి సురేష్ తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువచ్చాడు. దీంతో విసుగు చెందిన సురేష్ ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి అప స్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్య సేవలు నిమిత్తం శ్రీకాకుళం తరలించారు. సురేష్ ఇచ్చిన వాంగ్మూలంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యసనాలకు బానిసై.. అప్పులు చేసి

- తీర్చడానికి దొంగగా మారిన వ్యక్తి అరెస్టు
- శాలిహుండం చోరీ కేసు ఛేదించిన పోలీసులు
- పదిహేడున్నర తులాల బంగారం స్వాధీనం


మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై అప్పులు చేసిన ఓ వ్యక్తి, వాటిని తీర్చడానికి దొంగగా మారాడు. దీంతో గ్రామంలో ఆయన ఉంటున్న పక్కింట్లోనే పదిహేడున్నర తులాల బంగారం చోరీకి పాల్పడ్డాడు. ఈ మేరకు గార పోలీసులు చాక చక్యంగా వ్యవహరించి కేసు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి బంగారం స్వాధీనం చేసుకున్నారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద చోరీ వివరాలను విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు.. గార పోలీసు స్టేషన్ పరిధి శాలిహుండం గ్రామంలో జనవరి 22న ఉదయం ఉరజాన రమణమ్మ ఇంట్లో 17.5తులాల బంగారం చోరీకి గురైంది. ఈ మేరకు రమణమ్మ భర్త ఆదినారాయణ గార పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదినారాయణ సింగుపురం జంక్షన్‌లో పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. ప్రతి రోజూ మాదిరిగా జనవరి 22వ తేదీ ఉదయం ఆదినారాయణ, భార్య రమణమ్మ దుకాణానికి వెళ్లిపోయారు. రాత్రి 8.30 గంటలకు తిరిగి వచ్చి చూడగా ఇంటి వెనుక భాగంలో తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో బంగారు ఆభరణాలు ఉన్నాయో లేదో అని చూసేందుకు తాళం వెతికారు. దొరక్క పోవడంతో సమీపంలో ఉన్న షరాబుతో తాళం తెరిపించారు. బీరు వాలో రమణమ్మ ఇద్దరు కుమార్తెలకు చెందిన పద్నాలుగు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆదినారాయణ ఫిర్యాదుమేరకు ఎస్ఐ జనార్దనరావు కేసు నమోదు చేయగా సీఐ పైడపునాయుడు దర్యాప్తు నిర్వ హించారు. దర్యాప్తులో భాగంగా ఇంట్లో మరో మూడున్నర తులాలు పోయినట్లు బాధితులు గుర్తించి పోలీసులకు తెలిపారు.

కదలికపై నిఘా..రాత్రి బస చేసి

కేసు దర్యాప్తు చేపట్టిన శ్రీకాకుళం సీఐ పైడపునాయుడు, ఎస్ఐ జనార్దనరావు గ్రామంలో ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా ఉంచారు. గ్రామంలో రాత్రి బస చేసి తొలుత అనుమానిత వ్యక్తులపై ఆరా తీశారు. రమణమ్మ ఇంటి పక్కన ఉన్న ఆది ఆంధ్ర వీధికి చెందిన జోగిరాజు తీరుపై పోలీసులకు అనుమానం వచ్చింది. దీంతో ఎస్ఐ జోగి రాజును అదుపులోకి తీసుకుని విచారించారు. వ్యసనాలకు బానిసై చేసిన అప్పులు తీర్చలేక జోగిరాజు దొంగతనం చేయాలనుకున్నాడు. అప్పటికే రెండు, మూడు సార్లు యత్నించాడని పోలీసులు గుర్తించారు. ఇంతలో జోగిరాజు తన ఇంటి పక్కనే ఉన్న రమణమ్మ ఇంటి వెనుక తలుపులు వేయకపోవడాన్ని గమనించి ఆమె వెళ్లిపోయిన తర్వాత ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంట్లోని బీరువా తాళం సాయంతో తలుపులు తెరిచి ప్లాస్టిక్ బాక్స్‌లో ఉన్న పదిహేడున్నర తులాల బంగారాన్ని దొంగిలించి వెళ్లిపోయాడు. జోగిరాజు కూడా ఏమీ తెలి యనట్లు రమణమ్మ ఇంటికి వెళ్లి దొంగతనం జరిగిందా అని ఆవేదన వ్యక్తం చేశాడు. దొంగిలించిన బంగారాన్ని ఇంట్లో సౌండ్ బాక్స్‌లో దాచిపెట్టినట్లు పోలీసులకు దర్యాప్తులో తేలింది. దీంతో బంగారాన్ని స్వాధీనం చేసుకుని జోగిరాజును ఆదివారం సాయంత్రం గార పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఎటువంటి సాంకేతిక పరమైన ఆధారాలు లభించనప్పటికీ కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ పైడపునాయుడు, గార ఎస్ఐ జనార్దనరావు, వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ, ఏఎస్ఐ శ్రీనివాసరావు, పీసీలు సూరిబాబు, జగదీష్, రమణమూర్తి, బాలకృష్ణలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

నందిగాం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువులను ఆదివారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. హైవేపై నిర్వహిస్తున్న తనిఖీ సందర్భంగా 46 ఆవులు, ఎద్దులతో ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న లారీని నందిగాం వద్ద స్వాధీనం చేసుకున్నామన్నారు. పశువులను కొత్తవలస గోశాలకు అప్పగించినట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి లారీ డ్రైవర్ రజ్వాన్, క్లీనర్ కుమార్‌లను అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉద్దానం రక్షిత నీరు వృథా


రోడ్డుపై అడుగు మేర ప్రవహిస్తున్న తాగునీరు

పలాస, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఒక నిర్లక్ష్యం వేలాది లీటర్ల తాగునీరు రోడ్డు పాలైంది. రెండు రోజులుగా ఈ నీరు వృథాగా రోడ్డుపై ప్రవహించగా మునిసిపల్ అధికారులు సోమవారం బాగు చేశారు. కాశీబుగ్గ-అక్కుపల్లి మార్గంలో ఓ బంగారు వర్తకుడు భారీ గోడౌన్‌ను నిర్మిస్తుండగా దీనికి సంబంధించి రోడ్డుపై సీసీ పిల్లర్లు వేసేందుకు గోతులు తవ్వుతున్న సమయంలో ఉద్దానం రక్షిత నీటి పథకం పైపులైన్‌కు రంధ్రం పడింది. వెంటనే బాగు చేయాల్సి ఉన్నా నీరు లేదని యథాతథంగా విడిచిపెట్టిరు. ఉదయం ఉద్దానం గ్రామాలకు మంచినీరు సరఫరా చేయగా ఆ నీరంతా రోడ్డుపై అడుగు మేర ప్రవహించింది. విషయం తెలుసుకున్న కమిషనర్ రామారావు సిబ్బందితో కలిసి సదరు ప్రదేశానికి సందర్శించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది చేరుకొని రంధ్రాన్ని పూడ్చారు. ఈ వ్యవహారంపై కమిషనర్‌ను వివరణ కోరగా సంబంధిత యజమానికి నోటీసులిస్తున్నామని, వాస్తవ స్థలం ఎంత మేరకు ఉంది, భవనానికి అనుమతులున్నాయా లేదా అనే అంశాలను పరిశీలిస్తున్నామన్నారు.

రామాలయం అర్చకుడి మృతి

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బాతుపురం-పెదవంక రామాలయం అర్చకుడు పాణిగ్రాహి ప్రసాద శర్మ (60) సోమవారం సాయంత్రం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలి పారు. ప్రసాద్ శర్మ మృతి పట్ల బాతుపురం- పెదవంక గ్రామాల ప్రజలు సంతాపం తెలిపారు.


ప్రసాదశర్మ (ఫైల్)

ప్రమాదమని తెలిసినా..!


టెక్కలి: రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

టెక్కలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు ప్రమాదకరంగా ఉంది. రోడ్డుపక్క బెర్మ్‌లు కోరుకుపోయి పెద్ద రంధ్రం ఏర్పడడంతో వాహనాలు ఎప్పుడు అదుపు తప్పినా ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. రాత్రి సమయాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటోందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో బాలికోన్నత పాఠశాలతో పాటు వసతి గృహాలున్నాయని, దీన్ని దృష్టిలో తక్షణం అధికారులు స్పందించి రంధ్రాన్ని పూడ్చడంతో పాటు బెర్మ్‌లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

పెంటూరు-శివరాంపురం మార్గంలో..

నందిగాం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పెంటూరు నుంచి శివరాంపురం వెళ్లే మార్గంలో ఏర్పడిన గోతులు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. పెంటూరు వద్ద, కొత్తచెరువు సమీపం లో రోడ్లపై రంధ్రాలు ఏర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోద కులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ మరింత ఆందోళన కలుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.


గోతులతో నిండిన నివగాం వద్ద రోడ్డు

నివగాం వద్ద..

కొత్తూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశాలను కలుపుతూ ఉన్న పాలకొండ-హడ్డుబంగి ప్రధాన మార్గంలో నివగాం గ్రామం వద్ద రోడ్డు దారుణంగా ఉంది. పెద్ద పెద్ద గోతులుగా మారి వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఆనుకుని కాలువలు లేకపోవడంతో ఇళ్ల, దుకాణాల నుంచి వాడుకనీరు రోడ్డుపై గోతుల్లో చేరి అధ్వానంగా తయారైంది. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు వివిధ పనులపై సమీపంలోని పట్టణాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి ఇలాగే ఉండడంతో ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


నందిగాం: పెంటూరులో రహదారి వద్ద ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

బీసీ బాలికల వసతి గృహం సందర్శన

నరసన్నపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బీసీ బాలికల వసతి గృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు సోమవారం సందర్శించారు. వసతిగృహంలో భోజనం, మరుగుదొడ్లు, గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలు పచ్చిన మొక్కలతో ఆహ్లాదకరంగా ఉందని, జిల్లాలోని మిగిలిన హాస్టళ్ల ఇలాగే ఉండాలన్నారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకు న్నారు. స్థానిక సబ్ జైల్‌ను పరిశీలించి ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీఎల్‌టీ వసూలు చేయండి

పలాస, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో ఖాళీ స్థలాలపై పన్ను(వీఎల్‌టీ) వేసి సంబంధిత యజమానుల నుంచి వసూలు చేయాలని కమిషనర్ ఎన్.రామారావు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని వార్డుల్లోని ఖాళీ స్థలాలను ముందుగా గుర్తించాలన్నారు. మున్సిపల్ చట్టం 1965 ప్రకారం ఖాళీ స్థలాలపై పన్ను చెల్లించేలా సంబంధిత యజమానులకు నోటీసులు అందించా లన్నారు. ఖాళీ స్థలాలు గుర్తించిన అనంతరం ఆ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టడం జరుగు తుందన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హరిపురం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాధాకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో చెరో 40 సీట్లు చొప్పున ఉన్నాయన్నారు. ఏప్రిల్ 6న 10 గంటలకు 5వ తరగతి, మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు పాఠశాలలో ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రహదారి సమస్యకు పరిష్కారం

మెళియాపుట్టి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గోకర్ణపురం నుంచి ఎస్‌ఎల్‌పురం గ్రామానికి వెళ్లేందుకు జిరాయితీ భూమి నుంచి రోడ్డును వేయడంతో గ్రామానికి వెందిన వేణు అనే రైతు రోడ్డును తొలగిస్తున్నారని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌ ఎండా కలిసి సర్వే చేశారు. ఈ సర్వేలో జిరాయితీ భూమిగా తేలింది. అయితే గత ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు ఉందని, ఇప్పు డు తొలగించ డం మంచి పద్ధతి కాదని రైతుకు నచ్చజెప్పి సమస్యకు పరిష్కారం చేపినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శివసాగర్ తీరంలో ఆదివారం సాయంత్రం సందర్శకులు పోగొట్టుకున్న బ్యాగ్‌ను అక్కుపల్లి శ్రీరామసేవా సంఘం అధ్యక్షుడు మోన వర ప్రసాద్ ఆధ్వర్యంలో బ్యాగ్ యజమానికి సోమవారం అందించారు. ఈ బ్యాగ్‌లో మూడు సెల్‌ఫోన్లు, ఒరిజినల్ సర్టిఫికేట్లు, కొంత నగదు ఉండడం, ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం తెలుసుకున్న మెళియాపుట్టి మండలం తంగిణి గ్రామానికి చెందిన సవర త్రివేణి కుటుంబ సభ్యులతో కలిసి సంఘం కార్యాలయానికి వచ్చి బ్యాగును తీసుకున్నారు. ఈ సందర్భంగా సేవా సంఘం ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అధిక వడ్డీ ఆశ చూపి రూ.60 కోట్లతో పరారీ?

- లబోదిబోమంటున్న బాధితులు
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం

పాతపట్నం/మెళియాపుట్టి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 'మీకు రూ.6 నుంచి రూ.10 వడ్డీ కావాలంటే నాకు డబ్బులివ్వండి.. మూడు నెలల వడ్డీ మొత్తం ముందే మీకిస్తాన'ంటూ గత ఐదేళ్ల నుంచి ప్రజలను నమ్మించి, వారి వద్ద నమ్మకంగా ఉంటూ రూ.60 కోట్ల వరకు సేకరించి ఓ వ్యక్తి పరారీ అయినట్లు తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లాకు చెందిన ఒక వ్యక్తి ఐదేళ్ల కిందట పాతపట్నంలో ఇల్లు అద్దెకు తీసుకుని పరిసర ప్రాంతాల ప్రజలతో పరిచయాలు పెంచుకున్నాడు. వడ్డీకి డబ్బులు కావాలని నమ్మబలికాడు. అధిక వడ్డీ ఇస్తానని చెప్పడంతో అధికంగా ప్రజలు డబ్బులిచ్చినట్లు సమాచారం. ఎవరికీ అనుమానం రాకుండా ముందుగానే మూడు నెలల వడ్డీ ఇవ్వడంతో వారిలో ఆశ పెరిగింది. దీంతో పాతపట్నం, కొత్తూరు, మెళియాపుట్టి మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు అతడికి అధిక మొత్తంలో డబ్బులు ఇచ్చారు. కొత్తూరు మండలానికి చెందిన అప్పులిచ్చిన వారు కొందరు సదరు వ్యక్తి ఇంటికొచ్చి చూడగా తాళాలు వేసి ఉండడంతో అనుమానం వచ్చి ఫోన్లు చేశారు. ఫోన్ సైతం ఎత్తక పోవడంతో వారంతా లబోదిబోమంటున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు ఇచ్చేందుకు వారి వద్ద ఎటువంటి హామీ పత్రాలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రేపో, ఎల్లుండో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

భూములకు గుర్తింపు నెంబరు తప్పనిసరి

నరసన్నపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రైతులు తమ భూములకు సంబంధించి గుర్తింపు నెంబరును పొందేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి కె.త్రినాథస్వామి సూచించారు. సోమవారం కోమర్తి రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏవో సునీత, మాజీ సర్పంచ్‌లు కింజరాపు సూర్యనారాయణ, శిమ్మ జగన్నాథం, ముద్దాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బస్సు బోల్తా ఘటనపై చర్యలు తీసుకోవాలి

హరిపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో వెళ్తున్న బస్సు చెరువులో బోల్తా పడిన ఘటనలో బాధ్యులైన ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయ కులు సీహెచ్ రవి కోరారు. ఎంఈవో ఎం.లక్ష్మణరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. పాఠశాలలను గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన చేపడుతున్నారన్నారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు హరిప్రసాద్ పాల్గొన్నారు.

సమయపాలన ఏదీ?

- వేళలు పాటించని ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు
- సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఉదయం 11 గంటల సమయంలో కార్యాలయంలో ఒకే ఒక్కరు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నిత్యం ఎక్కడో ఒక దగ్గర జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పర్యటిస్తూ సమయపాలన పాటించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం సిబ్బంది ఆ ఆదేశాలకు బేఖాతర్ చేస్తు న్నారు. సమయపాలన అనేది మచ్చుకైనా కానరావడం లేదని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నుంచి సిబ్బంది వరకు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి ఉండి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ సోమవారం ఎంపీడీవో కార్యాలయమే. ఉదయం 11 గంటలకు కార్యాలయ ఏవో కుమార్ పట్నాయక్ మాత్రమే ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎంపీడీవో జయంత్ ప్రసాద్, పంచాయతీ విస్తరణాధి కారి పద్మజ, సీనియర్ అసిస్టెంట్ డి.నర్సింగరావుతో పాటు మిగిలిన సిబ్బంది సకాలంలో హాజరుకాలేదు. ఇతర ప్రాంతాల నుంచి విధులకు వచ్చే అధికారులు, సిబ్బంది హెచ్‌ఆర్ ఏలు డ్రా చేసుకుంటున్నారు. దీంతో ఎప్పుడు విధులకు వస్తారో వారికే తెలియని పరిస్థితి. ఎంపీడీవో పాతపట్నం నుంచి, కార్యాలయ ఏవో కుమార్ పట్నాయక్ విజయనగరం నుంచి, పంచాయతీ విస్తరణాధికారి పద్మజ శ్రీకాకుళం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇతర సిబ్బంది కూడా వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు అధికారులు, సిబ్బంది లేక నిరాశగా వెనుదిరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు. దీనిపై జడ్పీ సీఈవో శ్రీధర్ రాజాను వివరణ కోరగా అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాల్సిందేనని, సకాలంలో రానివారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

'వంశధార' కాలువ ఆధునికీకరణ చేపట్టండి

- కేంద్రమంత్రిని కోరిన ఎమ్మెల్యే బగ్గు


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నియోజవర్గంలో పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకుగాను వంశధార కాలువను ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. జలుమూరు మండలం కరకవలస నుంచి పోలాకి మండలం డోల వరకు కరకట్టలు, వంశధార ఆధునికీకరణ పనులు పూర్తయితే 80శాతం సాగునీరు నాలుగు మండలాలకు ఉపయోగ పడుతుందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఇటీవల డీపీఎన్ రోడ్డుకు నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ రామ్మోహన్ నాయుడును ఎమ్మెల్యే టీడీపీ నేతలతో కలిసి అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఐపీఎల్ జట్టుకు ఎంపికైన విజయ్‌కి అభినందన

టెక్కలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ డిల్లీ కేపిటల్ జట్టుకు ఎంపికైన జిల్లాకు చెందిన యువ క్రికెటర్ త్రిపురాన విజయ్‌ను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళంలోని ప్రజాసదన్‌లో అభినందించారు. రాష్ట్ర జట్టులో రాణించడంతో పాటు డిల్లీ కేపిటల్ జట్టులో కూడా ఐపీఎల్‌లో రాణించాలని మంత్రి ఆకాంక్షించారు.

బావిలో నీరందక ఇబ్బందులు

హిరమండలం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గొట్టాబ్యారేజీ దిగువన ఉన్న రక్షిత నీటి పథకానికి సంబంధించిన బావి అడుగంటిందని, అందువల్ల హిరమండలంలో పూర్తి స్థాయి లో కొళాయిల ద్వారా నీరందించలేకపోతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సాగర్ తెలిపారు. నీటి సరఫరా కాకపోవడంపై ఆదివారం చిన్నకోరాడకు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం జేఈ బ్యారేజి దిగువన ఉన్న పంప్‌హౌస్, నీరందించే బావిని పరిశీలించారు. ప్రస్తుతం 25 అడుగుల మేర నీరు ఉందని, అయితే పంపింగ్‌కు సరిపోవడం లేదన్నారు. నీటిని నింపే ట్యాంకు సామర్థ్యం రెండు లక్షల లీటర్లు అయినప్పటికీ లక్షన్నర లీటర్లు మాత్రమే నింపగలుగుతున్నామ న్నారు. సీపీడబ్ల్యూఎస్ పథకం 60వేల లీటర్ల సామర్థ్యం ఉన్నప్పటికీ 30 వేల లీటర్లు మాత్రమే నింప గలుగుతున్నామని చెప్పారు. ఈ రెండు పథకాలకు సంబంధించి అదనంగా 60 అడుగుల మేర బోరు తవ్వేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు.

గర్భం దాల్చిన ఇంటర్ విద్యార్థిని?

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

టెక్కలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ వసతిగృహ విద్యార్థిని గర్భం దాల్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటన శనివారం జరగ్గా ఆలస్యంగా బయటకు పొక్కింది. నందిగాం మండలానికి చెందిన ఆ విద్యార్థిని టెక్కలిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కడుపునొప్పి రావడంతో ఆ విద్యార్థినిని సదరు వసతిగృహ సిబ్బంది టెక్కలిలో ఓ ఆసుపత్రికి తీసుకువెళ్లగా గర్భిణిగా గుర్తించినట్లు తెలుస్తోంది. వెంటనే కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిపారు. మైనర్ గర్భం దాల్చిందనే సమాచారం బయటకు పొక్కడంతో వసతి గృహాలు ఒక్కసారిగా ఉలికిపడ్డాయి. ఈ విషయమై పలు వసతిగృహాల సంక్షేమాధికారులకు సమాచారం కోరగా అటువంటి ఘటనలేవీ జరగలేదని, ఇవన్నీ వదంతులేనని అంటున్నారు. వసతి గృహాల డివిజన్ స్థాయి అధికారులకు ఫోన్ చేసినా వారు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. అయితే అధికారులు వసతిగృహాలను పర్యవేక్షిస్తే తప్ప అసలు విషయం బయటకు వచ్చే అవకాశం లేదు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

హరిపురం, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): మందస మండలం పొత్తంగి గ్రామంలో గ్రామ దేవతలు చవిటమ్మ, భూలోక మాత, కొత్తమ్మతల్లి ఆలయ పునః ప్రారంభంతో పాటు విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ముర్రాటలతో చల్లదనం చేప ట్టారు. ఆలయాలను మాజీ మంత్రి గౌతు శివాజీ సందర్శించి పూజలు చేపట్టారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న గౌతు శివాజీ

మణిగాంలో..

నందిగాం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మణిగాంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి మందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. గ్రామ స్థుల ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు రేజేటి బోసుబాబు, ఇతర రుత్వికుల నేతృత్వంలో విశేష పూజలు శాస్త్రోక్తంగా చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆంజనేయ స్వామిని పలువురు నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్ బాక్స్

ఇంజనీరింగ్ విద్యార్థినికి సాయం

నందిగాం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): హర్షబాడ పంచాయతీ పెద్దగురువూరుకు చెందిన ఇంజనీరింగ్ విద్య అభ్యసిస్తున్న మొగిలిపాటి స్వప్నకు గిరిజన చైతన్య వేదిక సాయం అందించింది. మూడో సంవత్సరంలో ఫీజు చెల్లించేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో 15 రోజులుగా ఇంటి వద్దనే ఉండిపోయిన విషయం గ్రామస్థులు వేదిక ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన వారు రూ.10 వేలు, దాతల విరాళం మరో రూ.8 వేలు కలిసి ఆమెకు సోమవారం అందించారు. ఆది వాసీ సేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి వరహాల కృష్ణా రావు, ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రతినిధి యర్ర రాజు, మండలశాఖ అధ్యక్షుడు మొగిలిపాటి జగ్గారావు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సకు 55 మంది ఎంపిక

పలాస, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి సేవాసమితిలో సోమ వారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిం చారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య బృందం 55 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి వారిని ప్రత్యేక వాహనంలో విశాఖపట్నం తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు జగదీష్, సాయి, జేసీహెచ్ శ్రీనివాస్, కౌంతేయుడు, కృష్ణస్వామి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

బాలలతో పనిచేయిస్తే చర్యలు

సంతబొమ్మాళి,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): దుకాణాలు, హోటళ్లలో బాలకార్మికులతో పని చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని టెక్కలి కార్మికశాఖాధికారి ఆర్.రాధాకుమారి హెచ్చరించారు. సోమవారం సంతబొమ్మాళిలో దుకాణాలు, హోటల్స్ దాబాలను తనిఖీ చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ సుందర రావు, ఏఎల్ సీ కో-ఆర్డినేటర్ హూడి జనార్దనరావు, చైల్డ్‌లైన్ పర్సన్ మౌనిక పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ

హిరమండలం/మెళియాపుట్టి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు మంగళవారం నుంచి 25వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలె కె.రాంబాబు, పద్మనాభం తెలిపారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ సమన్వయంతో ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువు తున్న చిన్నారులకు తదుపరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం, తెలుగు, ఇంగ్లీష్ బోధనతో పట్టు సాధించేలా ఈ శిక్షణ ఇస్తున్నామని, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

శ్రీముఖలింగేశ్వరుడి సన్నిధిలో ఒడిశా ఇంటాక్ బృందం

జలుమూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): దక్షణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రాన్ని కళింగ (ఒడిశా) ఇంటాక్ బృంద సభ్యులు సోమవారం సందర్శించారు. కళింగ రాజ్యాన్ని పాలించిన అనంతవర్మ చోడగంగ రాజు పట్టాభిషేకం 947 సంవత్సరాలు పూర్వం ఈ పుణ్యక్షేత్రంలోనే జరిగిందని ఇంటాక్ సభ్యుడు విష్ణుమోహన్ తెలిపారు. అనంతవర్మ చోడ గంగరాజు చేసిన కృషిగాను ఆయన చిత్రపటాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. కార్యక్రమంలో ఇంటాక్ బృంద సభ్యులు దీపక్ కుమార్ నాయక్, మురళీధర్, తరుణసింగ్ పట్నాయక్, ఆలయ ఈవో ప్రభాకరరావు,అర్చకులు పాల్గొన్నారు.

ఆలయ ఆదాయం రూ.1.36 లక్షలు

పోలాకి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సుసరాం దుర్గమ్మ జాతర సందర్భంగా సోమవారం హుండీని దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. ఈవో విశ్వేశ్వరరావు, సిబ్బంది ఆలయ శాశ్వత ధర్మకర్త సనపల అప్పలసూరి, సర్పంచ్ దుంపల ఆనందరావు సమక్షంలో హుండీని లెక్కించారు. మొత్తం రూ1,36,243 వచ్చినట్టు తెలిపారు.

వేద గణితంలో పట్టు సాధించాలి

నరసన్నపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వేద గణితంపై పట్టుసాధించడం ద్వారా పరీక్షల్లో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం ఉంటుందని వేద గణిత నిపుణుడు పి.సత్యనారాయణ అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేద గణితంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ శాంతిహేమ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

పాతపట్నం ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. రొంపివలస జడ్పీ హైస్కూల్‌లో సోమవారం 'సంకల్పం'లో విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణ, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. మత్తుబారిన పడితే జీవితాలు ఛిద్రమవుతాయన్నారు.

హైస్కూల్ ప్లస్ టూ విధానాన్ని కొనసాగించాలి

హరిపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హైస్కూల్ ప్లస్ టూ విధానాన్ని కొనసాగించాలని యూటీఎఫ్ రాష్ట్ర నేత కోరెడ్ల విజయ గౌరి కోరారు. మందస మండల యూటీఎఫ్ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం 117 జీవోతో విద్యను పూర్తిగా నాశనం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం విద్య పరిరక్షణ పేరుతో ఉపాధ్యాయుల నిర్ణయాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటూ విద్యను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. నాయకులు బాబూరావు, ఈశ్వర రావు, రమణ బాబు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.